# మూడోసారి మాధవరం విన్..

- కూకట్‌పల్లిలో 'బీఆర్ఎస్'దే హ్యాట్రిక్ విజయం
- బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణారావు 71,387 ఓట్ల మెజార్టీతో ఘన విజయం



మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆనందంలో మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 3 : కూకట్‌పల్లి నియోజకవర్గం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు 71,387 ఓట్ల మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్ని సాధించారు. మాధవరం కృష్ణారావు 1,36,635 ఓట్లను సాధించి కూకట్‌పల్లి చరిత్రలో కొత్త రికార్డును సృష్టించారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన బండి రమేశ్ 65,248 ఓట్లను సాధించి రెండో స్థానంలో నిలిచి డిపాజిట్‌ను దక్కించుకున్నారు. జనసేన పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ 39,890 ఓట్లను సాధించి మూడో స్థానంలో నిలిచినప్పటికీ డిపాజిట్‌ను దక్కించుకోలేకపోయారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన బాశెట్టి నర్సింగ రావు 1769 ఓట్లను సాధించగా బీఎస్పీ పార్టీ అభ్యర్థి బి.సంజీవరావు 1382 ఓట్లను సాధించారు. నోటాకు 2446 మంది ఓట్లేశారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, జనసేన పార్టీల నేతలు కాకుండా ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగిన మరో 21 మంది కలిపి 9080 ఓట్లను మాత్రమే సాధించారు.

- కూకట్‌పల్లి నియోజకవర్గంలో తుది ఓటరు జాబితా ప్రకారం 4,63,864 మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ రోజున 2,50,853 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 1,29,880, మహిళలు 1,20,957, ఇతరులు 16 మంది ఓటును వేశారు. ఆదివారం ఎన్నికల ఫలితాలు వెల్లడించడంతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు ఒక్కరే 1,36,635 ఓట్లను సాధించగా.. కాంగ్రెస్, జనసేన పార్టీల అభ్యర్థులు కలిపి 1,05,138 ఓట్లను దక్కించుకోవడం చర్చనీయాంశంగా మారింది.

**పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలు..**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 944 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో బీఆర్ఎస్‌కు 359, కాంగ్రెస్‌కు 377, జనసేనకు 119, ఇతరులకు మిగిలిన ఓట్లను వేశారు.

**కృష్ణారావుదే మూడోసారి విజయం..**

**2014 అసెంబ్లీ ఎన్నికల్లో..**

టీడీపీ అభ్యర్థిగా మాధవరం కృష్ణారావు 99,874 ఓట్లు.. బీఆర్ఎస్ అభ్యర్థి గొట్టిముక్కల పద్మారావు 56,688, కాంగ్రెస్ అభ్యర్థి 23,321 ఓట్లను సాధించారు. ఈ ఎన్నికల్లో మాధవరం కృష్ణారావు 43,186 ఓట్ల మెజార్టీతో మొదటిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

**2018 అసెంబ్లీ ఎన్నికల్లో..**

బీఆర్ఎస్ అభ్యర్థిగా మాధవరం కృష్ణారావు 1,11,612 ఓట్లు.. టీడీపీ నందమూరి సుహాసిని 70,562, బీఎస్పీ అభ్యర్థి పన్నాల హరీశ్‌రెడ్డి 12,761 ఓట్లను సాధించారు. ఈ ఎన్నికల్లో మాధవరం కృష్ణారావు పై 41,049 ఓట్ల మెజార్టీతో రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

**2023 అసెంబ్లీ ఎన్నికల్లో..**

బీఆర్ఎస్ అభ్యర్థిగా మాధవరం కృష్ణారావు 1,36,635 ఓట్లు.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేశ్ 65,248, జనసేన పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ 39,980 ఓట్లను సాధించారు. మాధవరం కృష్ణారావు 71,387 ఓట్లను సాధించి తిరుగులేని మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్నారు.

### కూకట్‌పల్లిలో ప్రజలదే గెలుపు

కూకట్‌పల్లి నియోజకవర్గంలో నివసిస్తున్న ప్రజలందరు ఆదరించడం వల్లే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఘన విజయం సాధించానని మాధవరం కృష్ణారావు తెలిపారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్, జనసేన పార్టీల నేతలు విశ్వ ప్రయత్నాలు చేసినా కులాలు, మతాలు అంటూ రెచ్చగొట్టినా ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించారన్నారు. కూకట్‌పల్లిలో ఆ పార్టీల నేతల కుట్రలు, ప్రలోభాలకు లొంగని ప్రజలు వారికి తగిన విధంగా బుద్ధి చెప్పారన్నారు. కులాలు, ప్రాంతాలు, మతాలకతీతంగా ప్రజలందరూ కారు గుర్తుకు ఓటేసి హ్యాట్రిక్ విజయాన్ని అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు కూకట్‌పల్లిని మరింత అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు.

# హ్యాట్రిక్ విక్టరీ..

- కుత్బుల్లాపూర్‌లో 85,400 మెజార్టీతో బీఆర్ఎస్ ఘనవిజయం..
- రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ సాధించిన వివేకానంద్


కౌంటింగ్ కేంద్రం బయట మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్,డిసెంబర్ 3: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ.వివేకానంద్ ఘనవిజయం సాధించారు. ఎవరూ ఊహించని రీతిలో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ సాధించిన ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు. సమీప ప్రత్యర్థి బీజేపీ నాయుడు కూన శ్రీశైలంగౌడ్‌పై 85 ,400 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. అదేసమయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించిన మొట్టమొదటి ఎమ్మెల్యేగాను రికార్డు పుటల్లోకి ఎక్కాడు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోమొత్తం 6లక్షల99వేల130మంది ఓటర్లు ఉండగా 3లక్షల99వేల852 మంది ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 590 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 3లక్షల99వేల852 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా నియోజకవర్గం పరిధిలో 57.19 శాతం ఓటింగ్ నమోదు అయిన విషయం విధితమే. ఈ క్రమంలో కీసరమండలం, బోగారంలోని హోలీమేరి కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ.వివేకానంద్ ఘన విజయం సాధించారు. మొత్తం 22 రౌండ్లలో ఓట్లను లెక్కించగా ప్రతిరౌండులోనూ వివేకానంద్ స్పష్టమైన ఆధిక్యం కనబరిచారు. 85వేల400 ఓట్ల మెజార్టీతో అద్భుత విజయం సాధించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు రెండు, మూడు స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఏ ఒక్క రౌండ్‌లోనూ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ గానీ, కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి గానీ ఢీ కొట్టేప్రయత్నం చేయలేక పోయారు. పోలైన ఓట్లల్లో ఎమ్మెల్యే వివేకానంద్ 1లక్ష87వేల327 ఓట్లు సాధించగా, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ 1లక్ష1వేయి927 ఓట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి 1లక్ష 884 మాత్రమే దక్కించుకున్నారు. బరిలో నిలిచిన మరో 13మంది తమ డిపాజిట్‌ను కోల్పోయారు. వీరిలో బీఎస్పీ నుంచి మహ్మద్ అహ్మద్‌లిమ్రా పోటీచేయగా మిగతా వారు స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీచేశారు.

**పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ వివేకానంద్ హవా..!**

పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ ఎమ్మెల్యే వివేకానంద్ ఆధిక్యం కనబరిచారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 1927 ఓట్లు ఉండగా బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే వివేకానంద్‌కు 672 ఓట్లు పోల్‌కాగా 670 ఓట్ల దక్కించుకోగా బీజేపీ అభ్యర్థి కూనశ్రీశైలంగౌడ్‌కు 496 ఓట్లు పోలయ్యాయి.

**ప్రధాన అభ్యర్థుల తర్వాత నోటాకే అత్యధిక ఓట్లు..!**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి పోటీపడిన ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల తర్వాత అత్యధిక ఓట్లు నోటాకు పోలవడం గమనార్హం. ఇక్కడ బీఎస్పీ అభ్యర్థికి మొత్తం 1751 ఓట్లు పోల్‌కాగా నోటాకు మాత్రం 4079 ఓట్లు పోలయ్యాయి. మిగతా 11మంది అభ్యర్థులు వీరి దరిదాపుల్లో లేకపోవడం గమనార్హం.

**హ్యాట్రిక్ కొట్టిన వివేకానంద్...!**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రాజకీయచరిత్రలో ఎమ్మెల్యే వివేకానంద్ హ్యాట్రిక్ విజయం సాధించి చరిత్ర సృష్టించారు. ఉమ్మడి మేడ్చల్ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న కుత్బుల్లాపూర్ పునర్విభజనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంగా ఏర్పాటైంది. 2009లో తొలిసారి కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగగా నాడు స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన కూన శ్రీశైలంగౌడ్ టీఆర్ఎస్ అభ్యర్థిపై గెలుపొందారు. అనంతరం రాష్ట్ర ఏర్పాటు జరుగగా 2014లో ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన కేపీ.వివేకానంద్ టీఆర్ఎస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డిపై గెలుపొందారు. అనంతరం 2016లో ఎమ్మెల్యే వివేకానంద్ టీఆర్ఎస్‌లో చేరగా 2018లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి బరిలో దిగి కాంగ్రెస్ అభ్యర్థిపై ఘనవిజయం సాధించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి బరిలో దిగిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌పై అత్యధిక మెజార్టీ(85వేల400) సాధించి హ్యాట్రిక్ విజయం సాధించారు.

### ఊహించని మెజార్టీ..!

ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ కౌంటింగ్ కేంద్రం బయట ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. తనకు హ్యాట్రిక్ విజయం అందించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతటి విజయాన్ని తాను ఊహించలేదన్నారు. తనకు ఘనవిజయం అందించిన ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. రాష్ట్ర స్థాయిలోనే అత్యధిక మెజార్టీని కట్టబెట్టి తనపై నమ్మకం ఉంచిన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలు తన విజయానికి ఎంతోకృషిచేశారని,వారందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారి రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిదన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అండదండలతో నియోజకవర్గంలో రూ.6కోట్ల పై చిలుకు నిధులతో అభివృద్ధి చేశామని, దాని కృషి ఫలితంగానే ప్రజలు తనకీ విజయం అందించడం సంతోషంగా ఉందన్నారు.

### గులాబీ శ్రేణుల సంబురాలు


కేపీహెచ్‌బీ కాలనీలో పటాకులు కాల్చుతున్న బీఆర్ఎస్ నేతలు


బాలాజీనగర్‌లో సంబురాల్లో మాజీ కార్పొరేటర్ బాబూరావు, మల్లేశ్ యాదవ్, భాస్కర్, సుశీల్, హరినాథ్, బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు


కూకట్‌పల్లి దయార్‌గూడలో సంబురాల్లో బీఆర్ఎస్ పార్టీ నేతలు బొట్టు విష్ణు, యువకులు


పార్టీ శ్రేణులతో కలిసి సంబురాలు జరుపుకుంటున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి.


గాజులరామారం డివిజన్ శ్రీరాంనగర్‌లోవివేకానంద్ గెలుపొందడం పట్ల అమ్మవారి ఆలయం వద్ద 1001 కొబ్బరికాయలు కొడుతున్న సింగారం మల్లేశ్, తదితరులు


ప్రగతినగర్‌లో సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

### బీభత్సం సృష్టించిన కారు

- ఇద్దరికి గాయాలు • మద్యం మత్తులో కారు డ్రైవర్

దుండిగల్, డిసెంబర్ 3: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి,ప్రగతినగర్‌లోని మిథిలానగర్ వద్ద ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిథిలానగర్‌కు చెందిన శ్రీనివాస్ ఆదివారం రాత్రి తన టీఎస్09ఎఫ్‌జే-8628 నంబర్‌గల హ్యూందాయ్ కారులో నిజాంపేట్‌వైపు నుంచి మిథిలానగర్ వైపు వేగంగా వెళుతున్నాడు. కారు మిథిలానగర్ కమాన్‌వద్దకు చేరుకుంటున్న సమయంలో సడన్‌బ్రేక్ వేయడంతో అదుపుతప్పి పల్టీ కొట్టింది. అదే సమయంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న స్థానికులు తిరుపతి, హర్షిత్‌లను ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కారునడుపుతున్న శ్రీనివాస్ మద్యం మత్తులో ఉన్నాడని స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.